మనసు కారణంబు మరి యెందునుండిన
ఇల్లు అడవి ముక్తి నియ్య లేవు.
మనసు లేనివాడు మందిరమున నున్న
కాననమున నున్న కార్యమొకటె.

విద్యార్థులారా!

'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ' అని దక్షిణా మూర్తి అన్నాడు. ఈ విశ్వమంతయు కూడను మనస్సనే దర్పణమునందు ఒక పట్టణము వలె కనుపిస్తున్నది. మానవుడు సాధించవలసినది ధర్మ అర్థ కామ మోక్షములు కాదు. అంతఃకరణ నిర్మూలము. అంతఃకరణ పరిశుద్ధమే మానవునకు ప్రధానమైన పురుషార్థము. మనోమూలమిదం జగత్. జగత్తంతయు మనస్సుపైనే ఆధారపడి వుంటున్నది. విశ్వమునందు జరుగు సుఖదుఃఖములుగాని పాపపుణ్యములుగాని సత్యాసత్యములుగాని, అన్యాయ అక్రమములు గాని అన్నికూడను మనసునందే జరుగుతున్నవి. అన్నింటికిని మనస్సు కారణము. మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. బంధమోక్షములకు కూడను మనసే కారణము. ఐతే యీ మనస్సు పరిశుద్ధమైన అద్దము వంటిది. కానీ మనస్సుకు స్వతస్సిద్ధమైన శక్తి లేదు. ఈ మనస్సు యింద్రియములను ఆశ్రయించి వుంటున్నది. ఇది నేత్రముల ద్వారా చూస్తున్నది. తాను స్వతసిద్ధముగా చూడలేదు. కర్ణముల ద్వారా వింటున్నది. తాను స్వతసిద్ధముగా వినే శక్తిలేదు. ఇదే విధముగనే అన్ని యింద్రియముల ద్వారా యీ మనస్సు కార్యములు సలుపుతున్నది. కనుకనే యింద్రియములు చేసిన దోషములన్నియు కూడను మనస్సనే అద్దముపైన చిత్రింపబడుతున్నది. ఈ యింద్రియములు సంకల్ప వికల్పకాత్మకమైన తత్వముతో కూడి వుంటున్నవి. కనుక యిందులో దోషము ఎవరిది యింద్రియములదా లేక మనస్సుదా? మనస్సునందు స్వతసిద్ధమైన దోషములు లేవు. ఇంద్రియముల యొక్క సహవాసము చేతనే మనస్సు మాలిన్యము అవుతున్నది.

కనుకనే సర్వశాస్త్రములు కూడను మనస్సుకు మూడు దోషములున్నవని నిరూపించినవి. మల, విక్షేప, ఆవరణములని మూడు. మలమనగా యేమిటి? మన జీవితములో తెలిసియో తెలియకనో యనేక విధములైన దోషములు చేస్తున్నాము. కేవలము యీ

జన్మము నందే కాదు. ప్రతి జన్మము నుండి కూడను అనేక తరములనుండి కూడను యీ దోషములు మనము ఆచరిస్తూనే వున్నాము. కనుక యీ దోషము యొక్క మాలిన్యము తరతరములనుండి, యుగ యుగములనుండి మార్పు చెందక చిత్రముపైన చిత్రింపబడుతూ వచ్చింది. ఈ అద్దముపైన మాలిన్యము వుండినప్పుడు మనయొక్క స్వరూపము యిమాత్రము సుస్పష్టముగా గోచరము కాదు. ఈ కారణముచే మానవుడు తన స్వస్వరూపమును తాను దర్శించుకోలేక పోతున్నాడు. గుర్తించుకోలేక పోతున్నాడు. ఈ మనస్సనే అద్దమునందు తన యొక్క నిజ స్వరూపాన్ని చూడలేక పోతున్నాడు. కనుక యీ అద్దమునకు చేరిన మాలిన్యమును శుద్ధపరచటానికి తగిన కృషి చెయ్యాలి. ఐతే యిది ఏవిధముగా చేయాలి? దీనిని చేసే ఉపాయము ఏమిటి? ఏమార్గమును అనుసరించిన యిది పరిశుద్ధము కాగలదు? ఇది మానవుని యొక్క ఆహార విహారముల చేత పరిశుద్ధము గావించుకోవచ్చు. Past is past. గడచిపోయినది గడచిపోయినది. కానీ వర్తమానమునందైనా మనము పవిత్రమైన మార్గమును అనుసరించి దీనిని పరిశుద్ధ పరిచే ప్రయత్నమునకు పూనుకోవాలి.

యువకులైన విద్యార్థులు పరిశుద్ధమైన, దోషరహితమైన ఆహారమును భుజించాలి. ఎటువంటి పరిస్థితుల యందైన కూడను మనము దోషముతో కూడిన ఆహారమును స్వీకరించరాదు. భిక్షం దేహార్థం. వస్త్రం శీతలార్థం. మనకు యిచ్చిన ఆహారము దేహరక్షణకై. కానీ దేహమునకు కొన్ని అనారోగ్యములు కలిగించే ఆహారము సరియైన ఆహారము కాదు. దీనినే భగవద్గీత యందు పాత్ర శుద్ధి, పాక శుద్ధి పదార్థ శుద్ధి అత్యవసరమన్నారు. ఈనాడు మనము భుజించే పదార్థములు యేవిధముగా మనకు లభించినవి. ఇది కేవలము అన్యాయార్జితమా లేక న్యాయార్జితమా అనే విషయాన్ని మనము విచారించాలి. ఈనాటి మానవుడు అనారోగ్యమునకుగాని అశాంతికిగాని గురికావటానికి మూలకారణము అన్యాయార్జితమైన ఆహారమే. మనము సక్రమమైన, న్యాయమైన, ధర్మమైన రీతిలో ఆహారమును స్వీకరించటము లేదు. లౌల్యలికమైన లౌకికమైన, భౌతికమైన తృప్తి నిమిత్తమై మనము విచారణ చేయక విచక్షణా జ్ఞానము మనము విచారించక మనము అనేక పెడమార్గములు అనుసరించటము చేతనే యీ అన్యాయార్జితమైన ఆహారమును మనము సేకరించుకుంటున్నాము. కనుక మెంట్ట మొదట యీ మలశుద్ధి నిమిత్తమై పరిశుద్ధమైన ఆహారమును సేకరించాలి. ఐతే ఏది అన్యాయము ఏది న్యాయము అనే విచక్షణా జ్ఞానము సామాన్యులకు చాలా తక్కువ. పాత్ర శుద్ధి వున్నదో లేదో తెలియదు. పదార్థ శుద్ధి అంతకంటె మనకు తెలియదు. పాకశుద్ధి.

వంటి వాని భావములు యేవిధముగా వున్నవో అది మనకు యేమాత్రము తెలియదు. ఈ అన్నింటి పరిశుద్ధము కోసము మనము ప్రయత్నము చేస్తుంటే మన ఉదరము క్షీణించి పోతుంది. కనుకనే ఆహారము స్వీకరించే ముందు భగవదర్పితము చేసినప్పుడే యిది పరిశుద్ధమవుతుంది. ఎవరికి వారు భగవంతుడు ఎక్కడవున్నాడని ప్రశ్నించుకున్నప్పుడు తనలో నుండి కూడను ఒక పెద్ద జవాబు వస్తున్నది.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

నేను వైశ్వానర రూపములో నీ ఉదరమునందుండి నీవు భుజించిన ఆహారమును జీర్ణింపచేస్తున్నాను అని చక్కని జవాబు వుంది. ఐతే అతను జీర్ణింపచేస్తున్నాడు, మనము భుజించిన తరువాతనే. భగవదర్పితము కాకుండా మనము భుజించటము చేత అనేక మాలిన్యములు అనేక దోషములు, అనేక పాపములు దీనిలో ప్రవేశిస్తున్నాయి. కనుకనే

బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్.

బ్రహ్మార్పణ భావముతో మనము భుజించటము చేత అది ఆహారము కాదు ప్రసాదమవుతుంది. అందులో వుండిన దోషములన్నియు పరిహారమవుతాయి. తద్వారా మన మనస్సుకు అంటి వున్న మాలిన్యములు క్రమక్రమేణా కొంత పరిశుద్ధము కాగలదు. తిరిగి మనస్సనే అద్దము పరిశుద్ధముగా మారుతుంది. ఐతే యిది ఒక్క దినములో ఒక్క నెలలో ఒక్క పర్యాయములో పరిశుద్ధమయ్యేది కాదు.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

అభ్యాసము చెయ్యాలి. పుట్టిన ప్రతి మానవుడు కూడను walking, talking, eating అన్నీ అభ్యాసము చేతనే మనము పొందగలుగుతున్నాము. దీనికి కూడను ఒక విధమైన అభ్యాసము అత్యవసరము. ఒక వజ్రమునకు వెలకావాలనుకొంటే కోతలు కొయ్యాలి. బంగారు కూడను పరిశుద్ధమైన అపరంజిగా వుండాలనుకుంటే అనేక పర్యాయములు కాల్చి పరిశుద్ధము గావించాలి. అదేవిధముగనే మన మానవత్వమనే మనస్తత్వము సంస్కరింపచేసుకోవాలి. ఈ విధముగా చేయుటంచేత మనస్సునకు అంటిన మాలిన్యము కొంతవరకు తీరగలదు.

రెండవది విక్షేపము. అద్దము వంటిదే మనస్సు. కానీ అద్దమును మనము కదలిస్తూ వుండినంత వరకు మన ప్రతిబింబము కూడ అందులో కదలుతూ వుంటుంది.

ఈ మనస్సు నిరంతరము చంచలముగా అటుయిటు కదలటం చేతనే యిందులో వుండిన ప్రతిబింబము కూడను చంచలముగానే రూపొందుతున్నాది. 'చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్'. అని అర్జునుడు చెప్పాడు. ఈ చంచలమైన మనస్సుతో నేను జీవించలేక పోతున్నాను. ప్రమాదకమైనదిగా వుంటున్నాది. చాలా బలవత్తరమైనదిగా వుంటున్నాది. అని ప్రార్థించాడు. ఈ చంచలత్వమును స్థిరముగావించటానికి యేది వుపాయము. దీనినే ధ్యానమని, ప్రార్థన అని, చింతన అని యీ విధమైన నవవిధ మార్గములందు దీనిని క్రమక్రమేణా స్థిరపరచుకోవచ్చును.

శ్రవణం కీర్తనం విష్ణోస్స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం.

ఈ నవవిధ మార్గముల యందు మానవుడు పవిత్రమైన హృదయముతో ప్రార్థన సలిపినప్పుడు యీ చంచలత్వము క్రమక్రమేణా ఒక స్థాయికి రాగలదు. అయితే యీనాటి యువకులు మాలిన్యమైన మనస్సును మరింత మాలిన్యముతోనే అభివృద్ధి పరుస్తున్నారు. బురదలో కూడిన వస్త్రము తిరిగి బురదతోనే కడిగినప్పుడు ఆ బురద పోతుందా? బురదలో కూడిన వస్త్రమును పరిశుద్ధమైన జలములో కడగాలి. కాని ఈనాటి యువకులయందు అట్టి పరిజ్ఞానము శూన్యమైంది. ఈనాటి విద్యావిధానమునందు సరియైన వివేక విజ్ఞానములు లేకుండా పోతున్నాయి కనుకనే స్వార్థ స్వప్రయోజనమైన తత్వములు అభివృద్ధి ఐపోతున్నాయి. లౌకికమైన భోగభాగ్యముల నిమిత్తమై యీనాడు విద్యార్థి ప్రాకులాడుతున్నాడు. విద్యార్థులు భవిష్యత్తుకు తగిన ఆదర్శులు. భావి భారతోద్ధారకులైన విద్యార్థుల యొక్క హృదయములు మాలిన్యముగా వుండినప్పుడు భారతదేశము పరిపాలన కూడను మాలిన్యముగానే రూపొందుతుంది.

విద్యార్థులారా! మీ విద్య కేవలం పొట్టకూటి కోసం నేర్చే విద్యలు కాదు. విద్య అనగా జీవిత పరమావధి నిమిత్తము ఏర్పడినది. విద్య జీవనోపాధి నిమిత్తమై యేర్పడినది కాదనే సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి విద్యార్థులు. జీవించటానికి మనిషిగా పుట్టనక్కర లేదు. పశుపక్షి మృగాదులు కూడను జీవిస్తూనే వుంటున్నాయి. ఇలా జీవించటానికి వుపయోగపడే విద్యలభ్యసించటము చేత మనము కూడను కేవలము పశువులతో సమాన మవుతాము. విద్యార్థుల యొక్క జీవితము ఆదర్శవంతమైన జీవితముగా రూపొందాలి. కనుక చంచలత్వమనే మానసిక తత్వాన్ని క్రమక్రమేణా స్థిరపడటానికి కృషి చెయ్యాలి. అదే ఏకాగ్రత. ఈ ఏకాగ్రత మనకు లభించాలంటే చేయవలసిన పని యేమి? మనము bend the body

mend the senses, end the mind it is the process of immentality. కనుక మనము దేహము వంచి శ్రమించి కర్తవ్య కర్మలాచరించాలి. mend the senses. మనము మన యొక్క ఇంద్రియములను సరియైన స్థితిలో పెట్టుకోటానికి తగినంత బలమును సంపాదించాలి. ఇంక మనస్సును సరియైన అదుపులో వుంచుకోవాలి. ఈ మనస్సు, యీ దేహము ఇంద్రియములు మన యొక్క ఆధీనమునందుంచుకున్నప్పుడే మనము master అవుతాము లేకపోతే మనము slaves అవుతాము. కనుకనే విద్యార్థులను master అంటారు. మాస్టరు అనగా ఇంద్రియములను వశము చేసుకున్నవాడే. ఈ master స్థాయి కొంతవరకు మితిమీరిపోయిన తరువాత అతను కేవలము master అవుతాడు. తరువాత అతను mister అవుతాడు. కనుక మీరిప్పుడు master స్థితిలో వుంటున్నారు. పేరు master గా పెట్టుకొని slaves గా మనము జీవిస్తే మన యొక్క జీవితమునకే ఒక కళంకము కాదా! కేవలము ఇంద్రియములకు లోబడి, ఇంద్రియార్థమై మనము పెడమార్గము పట్టకూడదు. విద్యను ఆర్జించాలి. ఇతర చింతలపైన మనము మనసు యేమాత్రము పెట్టకూడదు. లౌకిక, భౌతిక, ధార్మిక, రాజకీయములందు మనము యేమాత్రము ప్రవేశించకూడదు. అప్పుడే నీవు విద్యార్థివి అవుతావు లేకపోతే నీవు విషయార్థివి అవుతావు. మనసును సరియైన స్థితిలో వుంచుకున్నప్పుడు నీవు student దీనిని వివిధ మార్గములలో ప్రవేశపెట్టినప్పుడు stuped.

ప్రియమైన విద్యార్థులారా! మీరు students గా రూపొందాలి. ఈ విధమైన సార్థకనామాన్ని అందుకోటానికి మనము చిత్తశుద్ధిని ఏర్పరచుకోవాలి. స్థిరత్వాన్ని ఏర్పరచుకోవాలి. ఈ స్థిరత్వమైన మార్గానికి ఒక్క ఆధ్యాత్మికమే సరియైన ఆధారము. ఈనాడు లోకములో ఎంతమంది విద్యార్థులున్నారు. విద్యావంతులుంటున్నారు. కాని ఎందుకు యీనాడు దేశమంతా యిన్ని విధములైన అశాంతిలో కుమిలిపోతున్నాది. కేవలము superficial గా మనము విద్యనందుకుంటున్నామే గాని heart వరకు పోవటం లేదు. heart is inside art is outside బాహ్యదృష్టియందే మనము జీవితమును ప్రసరింప చేస్తున్నాము. అంతర్దృష్టిని మనము యేమాత్రము అభివృద్ధి పరచుకోటం లేదు. కనుక యీనాడు విద్యావిధానమంతయు కూడను కేవలము స్వార్థ స్వప్రయోజనముల నిమిత్తమై వుపయోగించుకుంటున్నారు. ఇది అన్యాయమా అక్రమమా అనాచారమా అనే సత్యాన్ని యేమాత్రము విచారించక పెడమార్గము పట్టి యేదో విధముగా ధనమును సంపాయించి అధికారులపై పోయి గొప్ప ధనవంతునిగా రూపొందాలని ఆశిస్తున్నాము. అనేకమంది విద్యార్థులు విదేశానికి పోవటానికి యిదే కారణము.

ధనము. ధనము. ఏమిటా ధనము. నిజమైన ధనము ఏమిటి? గుణమే నిజమైన ధనము. కనుక గుణమనే ధనమును పోషించుకోవాలి. మనము పుట్టి పెరిగిన దేశము యొక్క భక్తిని బలపరచుకోవాలి.

ఇది నాదు మాతృదేశము
ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం
చెడగొట్టి నడువనేరక
బ్రతికిన పినుగాకడు వసుధను గలడా.

మన దేశాభిమానమే లేకపోతే యింక పరదేశము యొక్క విచారణ ఎందుకు చెయ్యాలి. కన్న తల్లినే మరచిన వ్యక్తి పినతల్లిని మరువకుండా వుంటాడా. కేవలము ధన నిమిత్తమై మనము యీ విధముగా beggars గా తయారు కాకూడదు. నీవు beg చెయ్యాలనుకుంటే నీ స్వదేశములో చేయి. కాని విదేశాలు పోయి నీవు కేవలము భిక్షాపాత్ర నెత్తుకొని ధనమును సంపాయించుకొని బ్రతికే దానికంటె చావు మేలు. కనుక మన స్వదేశ సేవలో స్వదేశ విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. అలాంటి determination మనము పూనాలి.

విద్యార్థులారా! భారత దేశమునందు పుట్టి యిది నా ప్రియ మాతృభాషయని చెప్పుకుంటూ జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి మన జన్మభూమిపైననే విశ్వాసము లేకపోతే యింక ఎందుకోసం మన జన్మ ఎత్తాలి. కనుక మన దేశమునందే వుండి మన దేశ సేవ చేసి దేశప్రజలను సరియైన రీతిలో తీర్చి దిద్దటానికి కంకణము కట్టుకోవాలి. ఎవ్వరైనా ఒక యింజనీరు పాసైనాడు ఒక మెడికల్ పాసైనాడు తక్షణమే foreign country కి passport ఏమిటిది. వీరందరు biggers కాదు beggars. నీ తల్లితండ్రుల సేవను నీవు చేయి. నీ కన్న భూమి యొక్క సేవ చేయి. నీ యొక్క దేశప్రజలను నీవు సరియైన రీతిలో ఆదుకో. నీ స్వార్థము స్వప్రయోజన నిమిత్తమై నీ శక్తి సామర్థ్యములు వుపయోగపెట్టుకో వద్దు. కనుక యిట్టి పవిత్ర భావములను మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే నీ యొక్క చిత్తము స్థిరత్వానికి వస్తుంది. లేకపోతే ఎప్పుడూ కూడను గడియారము పెండ్యులము మాదిరి అటూ యిటూ ఆడుతూ వుంటుంది - కనుక స్థిరత్వము కావాలనుకుంటే మొట్టమొదటనే master plan వేసుకోవాలి. ఏమి చెయ్యాలి? ఎలాంటి మార్గములో నేను నడుచుకోవాలి, నిజమైన మానవత్వమును అభివృద్ధి పరచుకోవాలి అనే విషయాన్ని విచారణ చెయ్యాలి. నా తల్లి తండ్రులు నా నిమిత్తమై ఎన్ని శ్రమలు పడుతున్నారు. నా జీవితము సర్వము వారిదే. విద్యార్థులారా! ఒక్కటి మాత్రము

మీరు మరవకూడదు. మీ food, మీ blood, మీ head మీ బుద్ధి అంతా మీ parents ఇచ్చినవి కనుక మొట్టమొదట parents కు gratitude చూపించాలి. వారిని ప్రసన్నులు చేయలేని మీ చదువులు ఎందుకోసం. కన్న తల్లిదండ్రులనే సంతృప్తి పరచలేని మీ చదువు ఎందుకోసం. వృద్ధులైన తల్లిదండ్రులను విసర్జించి పరదేశమునకు పోయి నీవు ఫ్యాషనుగా తిరుగుతుంటుంటే నీయొక్క పాపము పెరగక తగ్గిపోటం ఎట్లా అవుతుంది. తల్లి తండ్రులదగ్గర వుండి వారిని ప్రత్యేకముగా చూచుకోవాలి. అది నీ కర్తవ్యము. ఈ విధమైన పవిత్ర భావాన్ని అభివృద్ధి పరచుకున్నప్పుడే మన యొక్క చిత్తము స్థిరముగా మారుతుంది. దీనికి ప్రత్యేకమైన కసరత్తులు చేయనక్కర లేదు. సులభమైన మార్గములోనే వుంటున్నాయి మన వేదాంతమునందు. ఈ విధమైన మార్గములో పోయినప్పుడు మానవుడు మానవుడుగా కాకుండా మానవుడు మాధవుడుగా కూడా మారగలడు. కాని మానవుడు మాధవుడుగా మారటం అటుంచి మానవుడు మానవుడుగా కూడను మారటం లేదు. మానవుడు దానవుడుగా మారుతున్నాడు. కనుక పవిత్రమైన భావముల చేత పవిత్రమైన సాధనల చేత పవిత్రమైన చింతనల చేత మన చంచలత్వమును స్థిరముగా మార్చుకోవచ్చు.

ప్రతి ఒక్కటి జీవితములో కదిలిపోయే మేఘములే. ఒకటైనా స్థిరమైనది లేదు. పుట్టిన బిడ్డ child అనుకుంటాము. పది సంవత్సరములకు boy అయిపోతున్నాడు మరి ముప్పై సంవత్సరములకు man అయిపోతున్నాడు. 75 సంవత్సరములకు grand father అవుతున్నాడు. child, boy, man, grand father ఒక్కడైనప్పటికిని కాల పరిస్థితి చేత, కాల ప్రభావము చేత ఎన్ని మార్పులు చెందినాయి. అన్నీ మార్పు చెందేటువంటివే. ప్రతి ఒక్కటి మార్పు అనుకుంటే దాని వల్ల విచారమే మాత్రము అవసరము వుండదు A pleasure is an interval between pain and pleasure. రెండు బాధల మధ్యలోనే వుంటుంది సుఖము. దీనినే వేదాంతము నసుఖాత్ లభ్యతే సుఖం. సుఖము చేత మనకు సుఖము చిక్కదు. కష్టము చేతనే చిక్కుతుంది. నీవు ఇరువది నాలుగు గంటలు air condition room లో కూర్చుంటే air condition విలువ నీకు తెలియదు. రెండుగంటలు ఎండలో తిరిగి నీవు air condition room లో ప్రవేశించినప్పుడు దాని విలువ మనకు తెలుస్తుంది. కష్టమే పడకుండా సుఖము యొక్క విలువ మనకు అర్థము కాదు. కనుకనే కర్మణ్యేవ అధికారస్తే కర్మనే మనయొక్క అంధకారము.

కర్మను చెయ్యాలి. కాయము వంచాలి. హృదయాన్ని పవిత్రము గావించుకోవాలి. కేవలము సోమరిపోతులు మాదిరి తిని కూర్చుని వుండటము మానవుని కర్తవ్యము కాదు. Lazyness is rust and dust అన్నారు. Realisation best and rest. కనుక మనము realise చెయ్యాలి. నేను ఎవరు నేను మనిషినా పశువునా అనే విషయమును చక్కగా విచారణ చెయ్యాలి. అదే మనయొక్క religion. Religion అనగా realisation is religion ఈ విధమైన విచారణ చేత మనలో ఆశించిన మాలిన్యము కొంతవరకు పరిశుద్ధము కాగలదు.

ఇంక ఆవరణము. ఏమిటి యీ ఆవరణము. అద్దముపైన దట్టమైన బట్టను కప్పినప్పుడు అందులో మన ప్రతిబింబము కనుపిస్తుందా? ఏమాత్రము కనుపించదు. కనుక మలము చేత మానవ స్వరూపాన్ని మాలిన్యముగా చూస్తున్నాము. విక్షేపము చేత చంచలత్వముగా విశ్వసిస్తున్నాము. ఈ చంచలత్వము నా nature అనుకుంటున్నాము. నేను human body ని కనుక యిది సహజము అనుకుంటున్నాము. కానీ యీ ఆవరణము చేత నాదేహమే లేదు నాదేహమే నాస్వరూపమని విశ్వసిస్తున్నాము. విద్యార్థులారా! మనము చూచేది అనుభవించేది ఆనందించేది యివన్నీ కూడను reflection, reaction, resound. Reality ఒకటి వుంటున్నది. ఆ reality ని మరచిపోతున్నాము. Reaction ను అనుసరిస్తున్నాము. Resound ని వింటున్నాము. Reflection ని చూస్తున్నాము. కాని దీనికి ఒకటి ఆధారము వుందని కొంతవరకు గుర్తించాలి. ఈ అద్దము దట్టమైన బట్టలో మాయబడి వుంది. ఏ దట్టమైన బట్ట యిది అదేయే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే యీ అరిషడ్వర్గములు. ఇంతే కాదు. ఇవి కొంత సహజములే అయినప్పటికి ధన మదము, విద్యా మదము, కుల మదము, ఐశ్వర్య మదము, సౌందర్య మదము, యవ్వన మదము, తపో మదము యిలాంటి అష్టమదముల చేత కప్పబడివున్నది అద్దము. ఈ బలము ఎంతవరకు వుంటుంది. కదలిపోతుంది. కాలిక్రింద నీరు కదలిపోయినట్లుగా ఏక్షణములో పోతుందో చెప్పటానికి వీలుకాదు. మన యవ్వనము ఎంతసేపు వుంటుంది. మించు మించినట్లుగా ఒక్క నిమిషము లోపల మారిపోతుంది. మన విద్యా మదము. ఏమిటి యీ విద్యయొక్క మదము. నీకంటె గొప్ప విద్వాంసులు లోకములో ఎంతమంది లేరు. కనుక వారిని విచారణ చేస్తే నీ విద్య వారియొక్క దానిలో ఎంత స్థానం. ఇవన్నీ విచారణ చేస్తే మదమునకు యేమాత్రము అవకాశము లేదు. ఇది భ్రాంతి. భ్రమ.

625059009

చదువులన్నియు చదివి చాలవివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతి వున్నను
హీనుని గుణంబు మానలేడు.
తరచి చదువు చదవ తర్కవాదమె గాని
పూర్ణ జ్ఞానమెప్పుడు పొందలేడు
చదువు చదువు చదివి చావంగనేటికి
చావులేని చదువు చదవవలయు.
చదువుల్ నేర్చితి మంచు గర్వము వహింపన్ రాదు మకున్నయా
చదువే పాటిది! విద్యకున్ వినయమే సద్రూపమా...

ఆ వినయము రావాలి విద్యార్థుల యందు. ఆ వినయ విధేయతలు లేకపోవటం చేతనే మదము తలకెక్కుతున్నది. ఈ ధనమదము, విద్యామదము, యవ్వన మదము యీ మదముల చేత మానవత్వము కేవలము మరచిపోతున్నాడు. ఇవి క్రమక్రమేణా మానవత్వమును మరుగుపరిచే దుష్టగుణములే తప్ప మానవత్వాన్ని వికసింపజేసే పవిత్రగుణములు కావు.

ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబు మానునయ్యా

ఈ విధమైన మదముతో మనస్సనే అద్దమును కప్పిపుచ్చింది. కనుక యీ దట్టమైన బట్టను మనము తీసి వేయాలనుకుంటే ప్రేమను పెంచుకోవాలి. ఈ ప్రేమయే ప్రధానమైనది. అదే ప్రత్యక్ష పరమాత్మ. మనము యీ పవిత్రమైన ప్రేమ చేతనే సర్వులను ఒక్కరీతిగా కల్పికోవచ్చును. ఒక్క ప్రేమపాశము తప్ప అందరిని ఏకమత్యముగా అభివృద్ధి పరచటానికి మరో మార్గము లేదు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. క్రింద candle light పెట్టాము. దానిపైన అనేక రంధ్రములంలా కొట్టి పాత్రను మూసినాము. వున్నది ఒకే లైటు అయినప్పటికి ఆ రంధ్రముల ద్వారా అనేక లైట్లు వుండినట్లుగా కనుపిస్తున్నది. దానిపైన దట్టమైన వస్త్రము కప్పినాము. అందులో నుండి యే మాత్రము లైటు కనుపించటం లేదు. కనుక యీ దట్టమైన టర్కీ టవలు తీసి పక్కన పెట్టామంటే అప్పుడు అనేక జ్యోతులుగా కనుపిస్తుంది. అనేకముగా కనుపించే ఆ పాత్రను

మనము పగలగొట్టామంటే ఒక జ్యోతిగానే కనుపిస్తుంది. అదే ఏక జ్యోతి. అదే ఆత్మ జ్యోతి. వున్నది ఒక్కటే దానిపైన నవరంధ్రములలో కూడిన యీ దేహమనే పాత్రను కప్పినాము కనుక అనేక విధములుగా కనుపిస్తూ వున్నాయి. ఒక్కొక్క రంధ్రమునుండి ఒక్కొక్క లైటు వుండినట్లుగా కనుపిస్తున్నాది. అనేక జ్యోతులు లేవక్కడ. వున్నది ఒకే జ్యోతి. కాని దేహము యొక్క రంధ్రముల ద్వారా యివి అనేక జ్యోతులుగా కనుపిస్తున్నాయి. దీనిపైన మమత్వమనే దట్టమైన వస్త్రము కప్పెము. నాది అనే మమత్వము నేను అనే అహంకారము యీరెండు నేసిన వస్త్రము యిది. ఆ రెండింటిని మనము తీసి పారవేస్తే తద్వారా దేహము యొక్క భ్రాంతిని మనము అదుపులో పెట్టుకుంటే అదే ఏకోహం బహుశ్యాం. ఏకత్వమే అనేకత్వముగా రూపొందుతుంది.

విద్యార్థులారా! యీ మనస్సు బుద్ధి చిత్తము అహంకారము యీనాల్గింటి యొక్క చేరిక అంతఃకరణ. ఐతే యీ అంతఃకరణ అంటే ఏమిటి? కరణమనగా పనిముట్లు ఇంద్రియములు. అంతఃకరణమనగా లోపలి యింద్రియములు. అంతఃకరణమంటే అనేకరకములుగా వేదాంతమునందు వర్ణిస్తూ వుంటాము. కన్నులు బయట చూస్తున్నాయి. చెవులు బయట వింటున్నాయి. నోరు బయట మాట్లాడుతున్నది. చేతులు బయట పని చేస్తున్నాయి. కేవలము ముక్కు బయట వాసననే చూస్తున్నాయి. కాని వీటికన్నింటికి కొన్ని రూపములుంటున్నాయి. మనస్సుకు రూపము లేదు. బుద్ధికి రూపము లేదు. చిత్తమునకు రూపము లేదు. అహంకారమునకు రూపము లేదు. ఈ రూపము లేని అంతఃకరణముల యొక్క సమ్మిళితమైన స్వరూపమే దీని స్వరూపము. దీనికి నాలుగు విధములైన దోషములుంటున్నాయి. ఒకటి భ్రాంతి. రెండవది ప్రమాదము. మూడవది కరణాపాటవ. నాల్గవది విప్రలిప్స. ఈ నాల్గు దోషములే అంతఃకరణను మాలిన్యపరుస్తున్నాయి. మొట్టమొదటిది భ్రాంతి. ఎట్టిది యీ భ్రమ. త్రాడును చూచి పామనుకోటము పామును చూచి త్రాడనుకోటము. నిత్యమును చూచి అనిత్యముగా భావించటము. అనిత్యమును చూచి నిత్యముగా విశ్వసించటము యీ విధమైనదే భ్రమతో ప్రమాదము సంభవిస్తున్నది. త్రాడనుకొని పామును పట్టుకుంటే ప్రమాదము కాకమరి ఏమైపోతుంది. ఈనాడు మానవుడు దేహము సత్యమని విశ్వసిస్తున్నాడు. కాదు కాదు యిది కేవలము ఒక నీటి బుడగ వంటిది. ఎప్పుడో ఎక్కడో యే రకముగానో పగిలిపోతుంది ఇది సత్యము కాదు. ఇది సత్యము కాదు. ఇది కేవలము అస్థిపంజరము. మలమూత్ర దుర్గంధ మాంస రక్తమే గాని పునుగు జవ్వాదులు పుట్టబోవు. కనుక యీవిధమైన దేహమును సరియైన రీతిలో వినియోగించే శక్తి మనము విస్మరిస్తున్నాము.

విద్యార్థులారా! ఒక్కదానిని మీరు గుర్తించాలి. కన్నులున్నాయి. చెవులున్నాయి. నోరు వుంది ముక్కు వుంది అన్నీ వుంటున్నాయి. ఇవే చూస్తున్నాయి యివే వింటున్నాయి అనే విశ్వాసమే మనకు వుంటుంటే మరణించిన తరువాత same eyes, same ears, same nose same tongue ఎందుకు చూడటంలేదు వినటంలేదు. Body నోవైపోతే నవు అప్పుడు ఎందుకు చూడటానికి వీలుకాకుండా వుంది. కానీ చూపించే శక్తి లేదు. దేహము ఒక పెద్ద టార్చిలైటు వంటిది కన్నులు బల్బుల వంటివి. కేవలము బుద్ధి స్విచ్ వంటిది. కొత్త టార్చి, కొత్త బల్బు స్విచ్ ఆన్‌లో వుంది. కాని లైటు రావటంలేదు. కారణం ఏమిటి? cells లేవు అక్కడ. కనుక cells లేకపోవటం చేతనే లైటు మనకు రావటం లేదు. మన blood cells అంతా దివ్యమైన శక్తిలో కూడినటువంటివే. కాని ఒక్కొక్క తూరి మాడిపోతుంటాయి. దాని శక్తి కూలిపోతుంటాది అది యిందులో దైవత్వమే. కనుక ఆదివ్యమైనది యీ శరీరములో వుండినంత వరకు అనేకరకములైన పనులు ఆచరిస్తూ వుంటాయి. కనుక యిది సత్యమని మనము భావించి ప్రమాదమునకు గురియై పోతున్నాము. నమ్మదగిన వారిని నమ్మకుండా నమ్మరానటువంటి వారిని నమ్ముతున్నాము నాది నావారు అనుకున్న వారంతా ఎంతకాలము వుండగలరు. ఎవరికి ఎవరు. నిన్ను అనేకరకములుగా పెంచి పెద్ద చేసిన తల్లితండ్రులు నీవారనుకుంటావా వుండినంత వరకును గౌరవించవలసినదే. వారి సేవలు చేయవలసినదే. వారిని సంతృప్తి పరచవలసినదే యిది నీ కర్తవ్య ధర్మమే. కాని ఎవరెవరి కర్తవ్యము వారికి వుంటున్నది. ఎవరికి ఎవరు కూడను వచ్చే సమయములో చిన్న బట్టైనా తేరు. పోయే సమయములో వారు ఎడ్రస్సైనా యిచ్చిపోరు. ఎవరికి ఎవరు సంబంధము. ఐతే యిలాంటి దానిని సత్యమనుకుంటున్నాము. యిది మిథ్య.

ఒక వేదాంతి నాదగ్గరకు వచ్చాడు. స్వామి! బ్రహ్మ సత్యం జగన్మిథ్య అని శంకరాచార్యులవారు చెప్పారు కదా. ప్రత్యక్షముగా కనుపిస్తున్నాది. ప్రత్యక్షముగా అనుభవిస్తున్నాము. జాగ్రత్ స్వప్న సుషుప్తుల యందు జీవిస్తున్నాము. ఇది మిథ్య ఎట్లా అవుతుంది? అని ప్రశ్నించాడు. 'నాయనా! ప్రపంచము మిథ్య అనేది ప్రపంచమునకు వదలిపెట్టు. అది దానికి చూసుకుంటుంది. మొట్టమొదట నీవు సత్యమా మిథ్యమా కనుక్కోమన్నాను. మొట్టమొదట ఎవనికి వాడు సత్యమా మిథ్యమా అని గుర్తించుకుంటే ప్రపంచము యొక్క గుణము గుర్తించుకున్నవారౌతారు. ఈనాటి విద్యార్థులు కూడను అంతే. తన తత్త్వమేమిటో తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. విదేశముల యొక్క విషయాలను వినాలని కోరతారు. ఆదేశములో యేమి జరుగుతున్నాది యీ దేశములో యేమి జరుగుతున్నాది అని పరదేశముల యొక్క విషయాన్ని చూస్తున్నావు గాని

నీ దేహము లో యేమి జరుగుతున్నది అని మొట్టమొదట నీవు గుర్తించటానికి ప్రయత్నిస్తున్నావా? బయటి నుండి వచ్చిన news ను మాత్రమే నీవు receive చేసుకుంటున్నావు. నీ నుండి వచ్చే న్యూసెన్సును నీవు గుర్తించటము లేదు. కనుక మొట్టమొదట నీవు నిన్ను గుర్తించుకో. నిన్ను నీవు చక్కబరచుకో. ఆతరువాత యితరులను చక్కబరచటానికి ప్రయత్నించు ఇది మొట్టమొదట విద్యార్థులు గుర్తించవలసిన విషయము. కనుక శ్రమచేత ప్రమాదము సంభవిస్తుంది.

ఇంక మూడవది కరణాపాటన. అనగా ఏమిటి? కరణము అనగా యింద్రియము అపాటన అనగా దౌర్బల్యము. ఇంద్రియముల యొక్క బలహీనతే. ఇంద్రియములకు ఒక జబ్బు వుంటున్నది. ఈ జబ్బుతో కూడిన యింద్రియముల ద్వారా మనసు అనుభవిస్తున్నది. కనుక mind కూడను ఒక రోగిగా మారిపోతుంది. ఎట్టిది యీ యింద్రియముల రోగము. ఇంద్రియములు యేనాడు వున్నది వున్నట్టుగా చూపించదు. సమయస్ఫూర్తిగా యింద్రియములు పరివర్తిస్తూ వుంటాయి. ఒక చిన్న ఉదాహరణము. ఒక గ్రామములో ఒక పెద్ద రైతు వుండినాడు. అతను అన్ని విధముల ఆగ్రామమునకు పెద్ద. అదే గ్రామములో మధ్యస్థితికి చెందిన రైతు వున్నాడు. ఒకనాడు బయట ప్రదేశములోపల గ్రామ పెద్ద అయిన రెడ్డి పశువులు యీ మధ్యస్థాయిలో వున్న రైతు యొక్క పశువులు మేస్తూ వుండినాయి. ఏదో కారణము చేత ఒకదానికొకటి పోట్లాట ప్రారంభమైంది. ఈ పోట్లాట లోపల ఎక్కడ తగిలిందో రెడ్డిగారి యొక్క ఎద్దు క్రిందపడి చనిపోయింది. ఈ మధ్యస్థాయిలోనున్న రైతు బాధపడ్డాడు. ఈ గ్రామపెద్ద ధనవంతుడు గొప్ప పేరు కలిగినవాడు ఆ ఎద్దును నా ఎద్దు పొడిచి చంపింది. ఏమి గొడవ వస్తుందో యేమోనని చాలా భయపడుతూ పరుగెత్తి గ్రామపెద్ద యింటికి వచ్చాడు. ఈ భయము చేత, అదే ఒక బలహీనత, చెప్పవలసినదానికి విరుద్ధముగా చెప్పాడు పాపం. 'దొరగారూ! మీ ఎద్దు మా ఎద్దును పొడిచేసింది.' అని చెప్పాడు. రెడ్డిగారు పరమ శాంతముగా విన్నాడు. 'నాయనా! తెలివితేటలు కలిగినవారు బుద్ధికుశలత కలిగిన మానవులే ఒకరినొకరు చంపుకుంటున్నారు. నోరు లేని జంతువులు పశువులు వాటికి విజ్ఞాన సుజ్ఞాన ప్రజ్ఞానములు యే మాత్రము లేవు. పశువులు ఒకదానిని ఒకటి పొడుచుకొని చంపుకుంటే ఎవరేమి చేయగలరు. దీనికి యే మాత్రము నీవు యోచించనక్కర లేదు నాయనా! యిది లోక సహజమే' అని శాంతముగా చెప్పాడు. కాని యీ రైతు చెప్పిన పొరపాటును గుర్తించుకున్నాడు. 'దొరగారూ! దొరగారూ! చాలా పొరపాటు చేశాను నేను. నా ఎద్దు మీ ఎద్దును చంపింది' అన్నాడు. రెడ్డిగారు వుద్రేకము పొంగిపోయింది

'ఏమి నీతల పొగరు అధికమై పోయిందా నేను ఎవరని అనుకున్నావు. ఇంతగ్రామ పెద్ద అయిన నా ఎద్దును నీ ఎద్దు చంపిందంటే చాలా ప్రమాదము. నీకు పొగరెక్కి పోయింది. కావలసిన మాటలు అనేసి ఐదువందల రూపాయలు టొల్నా' అన్నాడు. చూశారా! తన ఎద్దులు ఇతరుల ఎద్దును పొడిచిందంటే సహజము అన్నాడు. ఇతరుల ఎద్దు తన ఎద్దును పొడిచిందంటే తప్పు అన్నాడు. ఈ విధమైన ఇంద్రియముల యొక్క స్వయస్ఫూర్తి మార్పులు జగత్తులో పెరిగి పోవటంచేత చెడ్డ మంచి మంచి చెడ్డగా మారిపోతున్నాయి. కనుక ఇంద్రియములకు ఒక విధమైన జబ్బు వుంటున్నది. మనకు మలేరియా జ్వరము వచ్చింది. దీనికి పూర్వము నీవు యే పదార్థము తినినా కారము కారము, వుప్పు వుప్పు, చేదు చేదుగా, తీపి తీపిగా వుంటూ వచ్చింది. కాని మలేరియా జ్వరము వచ్చినప్పుడు లడ్డూ తిన్నా చేదుగానే వుంటుంది. పదార్థ దోషము కాదు. ఇంద్రియ దోషము. మంచి ఆరోగ్యముగా వుంటున్నప్పుడు తెలుపు తెలుపు, నలుపు నలుపుగా చూస్తాము. కానీ జాండిస్ వచ్చిందంటే అంతా పచ్చగా కనుపిస్తుంది. అదే విధముగనే ఇంద్రియములు రోగముతో కూడినవి కనుక రోగముతో కూడిన ఇంద్రియములను అనుసరించటము చేత మనస్సు కూడా ఒక రోగముగా తయారౌతుంది. వరణా పాశనమనగా ఇంద్రియముల యొక్క దోషము చేత మానవత్వము కొంత వరకు మరుగు పడిపోతున్నాది.

విప్రలిప్స. అనగా కేవలము ఓర్వలేని తనము. అసూయ అని అర్థము. ఈ అసూయ మానవునకు చాలా చెడ్డ గుణము. ఎవరైనా వున్నవారంటే ఓర్వలేరు. ఎవరైనా మంచివారిని చూస్తే యేమాత్రము సహించుకోలేరు. ఈ లోకములో ఏ రోగమునకైనా, ఏ దేశమందైనా ఔషధము వుండవచ్చునేమో గాని అసూయ అనే రోగమును నివారణ చేసే ఔషధము ఎక్కడా లేదు. కనుక ఇతరుల మంచిని చూచి ఓర్చుకోలేకుండా పోవటము చెడ్డగుణము. మంచిని చూచి ఆనందించు. ఆనందించే వారిని చూచి నీవు కూడా ఆనందించు. అంతేగాని వారిపైన వీరిపైన అసూయ అభివృద్ధి పరచుకోకూడదు. ఎక్కువ మార్కులు వచ్చిన వారిని చూచి నీవు అసూయ పడవద్దు. నాకు లేకపోయినా నా brotherకి మంచి మార్కులు తెచ్చుకున్నాడని ఆనందించు. అందరూ నా బ్రదర్సే. Brotherhood of man fatherhood of God ఈ రకమైన పవిత్రమైన భావమును పెంచుకోవాలి. ఈనాడు ఈ అసూయా భావము రావటానికి కారణము ఏమిటి? స్వార్థము స్వార్థము. ఈ స్వార్థమనేది విద్యార్థులలో ఎక్కువ వున్నది. మీరు ఎక్కడైనా బస్సుకని బయలుదేరి పోతే ఎంతమంది వృద్ధులు, స్త్రీలు, పిల్లలు అంతా వుంటుంటారు.

నీవు విద్యార్థివి. ధృఢ శరీరము కలిగిన వాడవు. నీవు కొంచెము ఓపిక పట్టు కాని అయ్యో పాపం వారికి చిక్కని ఆ సీటు అని యే మాత్రమైనా విశాల భావము వుంటుందా? లేదు లేదు. ఆ బస్సులో నాకే మొదటి సీటు చిక్కాలి. ఇతరులు యేమైనా అయిపోనీ. అసూయ పెరిగిపోతుంది. శక్తి హీనులకు, బాలురకు, స్త్రీలకు మొట్టమొదట అవకాశము నందించుము. సీటు చిక్కుట లేదా సరి లేకపోతే కొంచెము దూరము నడువు. ఈ నడచుటం వలన రెండు విధములైన అనుకూలములు జరుగుతున్నవి. ఆదాయము వస్తుంది. walk చేయటము వలన శరీరము కసరత్తు కలుగుతుంది. ఒక మైలు దూరము నడిస్తే ఆ మైలు దూరము ఛార్జీ మిగులుతుంది. ఈ విధమైన విశాల భావాన్ని పెంచుకోవాలి. Examinations అయిన తరువాత Results వస్తుంటాయి. పేపర్సులో పెద్ద పెద్ద పేజీలు మూడు నాలుగు వుంటాయి లక్షల మంది results వీడు కూడా తన ప్యాసు కోసం తన నెంబరు కోసం కాచుకొని వున్నాడు. Indian Express లేక Hindu నో తెరిచి చూస్తే ఎన్నో నెంబర్లు కనుపిస్తాయి. నిజంగా ఆ నెంబర్సు చూస్తే ఎంత ఆనంద పడాలి. ఓహో యింత మంది ప్యాసై పోయినారా అని ఆనందించవచ్చు. కాని స్వార్థపరులకు యీ ఆనందము రాదు. ఇన్ని లక్షల నంబర్లలో నా నెంబరు వుందా అని వెతుకుతాడు. మొదట ఆనందించు తరువాత నీ నెంబరు వెతుకు తప్పు లేదు కాని ఏ మాత్రము అంత విశాల భావము రావటము లేదు. విద్యార్థులారా! యీ విధమైన అసూయా భావమును మొట్ట మొదట నిర్మూలము చేసుకోవాలి. నీవు పరిశుద్ధాత్మ స్వరూపుడవు. ఇదే వేదము ఘోషిస్తూ వస్తుంది. శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః. నీవు అమృత పుత్రుడవు నాయనా అని వర్ణిస్తుంది. కనుక నీవు విశాలమైన భావమును అభివృద్ధి పరచుకో. ఈ యింద్రియముల చంచలత్వమును సరియైన కంట్రోల్లో పెట్టుకో. తద్వారా మానసిక శుద్ధి ఏర్పడుతుంది. అప్పుడే త్రికరణ శుద్ధి కలిగిన మానవుడుగా తయారౌతాడు.

కనుక మనసు నందున్న మాలిన్యమును, అంతఃకరణమునకు పట్టిన మాలిన్యమును మనము నిర్మూలము గావించుకోవాలంటే సత్కర్మలు, సద్బుద్ధి, సచ్చింతన చేత పరిశుద్ధము చేసుకోవచ్చు. కనుకనే నీవు చెడ్డను చూడవద్దు మంచిని చూడు అన్నారు. చెడ్డను వినవద్దు మంచిని విను అన్నారు. ఈ విధమైన భావములు మనము మొట్టమొదట అభివృద్ధి పరచుకోవాలి. చిత్తశుద్ధికి కావలసిన matter ఒకటే వుంటున్నాది.

See no evil see what is good.

Hear no evil hear what is good.

625059015

Think no evil think what is good.

Talk no evil talk what is good.

Do no evil do what is good.

ఇవి పంచేంద్రియములు పంచభూతముల యొక్క ప్రసాదములు. ప్రసాదమును మనము అభివృద్ధి పరచుకుంటే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. జ్ఞానశుద్ధి కూడ కలుగుతుంది. దివ్యమైన ఆనందము అనుభవించగలము. కనుక విద్యార్థులారా! మనస్సు స్వతసిద్ధముగా చూడలేదు. చూచేది యింద్రియముల ద్వారానే. స్వతసిద్ధముగా మాట్లాడ లేదు. ఇంద్రియముల ద్వారానే మాట్లాడు తున్నది. కనుక యింద్రియాల్ని సరియైన స్థితిలో వుంచుకుంటే మనస్సు పరిశుద్ధమైనదిగానే రూపొందుతుంది.

కనుక యువకులైన మీరు దేహశక్తి, మనశ్శక్తి, ఆధ్యాత్మిక శక్తి, యింద్రియశక్తి అన్న గట్టిగా వుండిన యీ వయస్సునందే మీరు వీటిని అరికట్టలేక పోతే వృద్ధాప్యము లో యేవిధముగా అరికట్టగలరు. ఇప్పుడే దైవానుగ్రహమును మనము అధికముగా సంపాయించుకోవాలి. వర్షాకాలము లోపల చెరువులంతా నీరు నింపుకున్నప్పుడే ఎండాకాలము లోపల ఆ నీరునంతా వుపయోగ పెట్టుకోవచ్చు. కనుక యిది మంచి season మీకు. ఈ వయస్సు లోపలనే మీరు అనుగ్రహసారాన్ని అభివృద్ధి పరచుకోవాలి. హృదయానికి నింపుకోవాలి. ఇప్పుడు మీరు దీనిని అభివృద్ధి పరచుకున్నప్పుడే భవిష్యత్తు లో దీనిని సద్వినియోగము చేసుకోటానికి అవకాశము లభిస్తుంది. కనుక భగవత్ప్రేమను పెంచుకోండి. భగవంతుడు సర్వులయందు వుంటున్నాననే విశాలతను మనము అభివృద్ధి పరచుకోవాలి. భగవంతుడు యేనాడు మిమ్మల్ని మరువడు. కాని మరచేది భక్తుడే. God never leaves his devotees only devotees leave God. God never goes away from his devotees but devotees go from his God. పోయింది అంటూ భగవంతుడే అనుకుంటారు గాని భగవంతుడు పోవటం లేదు. భక్తులే పోతున్నారు. భగవంతుడు విడచటం లేదు. భక్తులే విడుస్తున్నారు. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకోలేక పోతున్నారు. లోకవాసనల చేత, లోకభ్రాంతుల చేత, లోకవిషయముల చేత కేవలము వారు కట్టుబడటం చేత మానవత్వము యిందు బంధింపబడి పోతున్నది. కనుక మీ సత్యాన్ని మీరు గుర్తించుకోండి. అదే నిజమైన conscience. అదే మీ witness. దానిని తృప్తి పరచుకుంటే జీవితమంతా తృప్తి అవుతుంది.

625059016

విద్యార్థులారా! ఈ ఐదు దినముల నుంచి శరీరము, ఇంద్రియములు, మనస్సు మనము కొంతవరకు తెలుసుకున్నాము. కాని ఈ రకమైన విషయములు మీరు గుర్తించుకున్నప్పుడే జీవితమంటే యేమిటి అనే విషయము మీకు సుస్పష్టమవుతుంది. ముందు బుద్ధిని గురించి మనము గుర్తించాలి. ఇదియే చాలా ప్రధానమైనది. tank లో వుంటుంటే tap లో నీరు వదలవచ్చు. కనుక దేహము, మనస్సు, ఇంద్రియములు ఇవన్నీ taps కాని బుద్ధి tank. ఈ tank లోపల ఎలాంటి నీరు నింపుతుంటామో taps లో అలాంటి నీరే వస్తుంది. దీనిని పురస్కరించుకొనియే వేదాంతము యద్భావం తద్భవతి అనింది. కనుక ఈ అన్నింటికిని మూలాధారమైన ఈ tank ను గురించి మున్ముందు మనము ముచ్చటించుకుందాం.